క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం



నాగన్నను పరామర్శిస్తున్న ట్రైకార్ చైర్మన్ గుండా సురేంద్ర

కర్నూలు(హాస్పిటల్): ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ జిల్లా కొండాపురం ఎస్టీ కాలనికి చెందిన పగడాల నాగన్నను గురువారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) చైర్మన్ గుండా సురేంద్ర పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యసిబ్బందికి సూచించారు. వైద్య చికిత్సల కోసం జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత వైఎస్సార్ జిల్లా నుంచి ట్రైకార్ నిధుల ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయనతో పాటు కర్నూలు జిల్లా సహాయ గిరిజన సంక్షేమాధికారి ఇ.ఉసేనయ్య, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప ఉన్నారు.

17న పుస్తక పరిచయ సభ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి కొమ్మువరపు విల్సన్‌రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' పుస్తక పరిచయ సభ ఈనెల 17న సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ హైదరాబాద్ సిటీ కాలేజ్ తెలుగు శాఖాధిపతి ప్రముఖ రచయిత డాక్టర్ కోయికోటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత తగుళ్ల గోపాల్ హాజరు కానున్నట్లు తెలిపారు.

సీఏఏ ఉపసంహరించుకోవాలి

కర్నూలు (న్యూటౌన్): రాజ్యాంగ వ్యతిరేక మత ప్రాతిపదికన పౌరసత్వం ఇచ్చే సీఏఏ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎస్‌డీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ డిమాండ్ చేశారు. స్థానిక పాతబస్తీలోని చౌక్ బజార్‌లో ఎస్‌డీపీఐ నేతలు, ముస్లిం మైనారిటీలు కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ముస్లింలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన సీఏఏ, యూసీసీ చట్టాలు తీసుకువస్తుందని, ఈ చట్టాలు చట్టసభలో నెగ్గేందుకు మద్దతు తెలిపిన పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నగర అధ్యక్షుడు అష్వాక్‌హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మత సామరస్యానికి విఘాతం

కర్నూలు(సెంట్రల్): బీజేపీ పాలనలో మత సామరస్యానికి విఘాతంక లిగించేలా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చర్యలు తీసుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. సీఏఏ చట్టం అమలుపై లౌకిక పార్టీ అని చెప్పుకునే టీడీపీ సమాధానం చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను ఓడించాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్ మహంకాళి

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డేనియల్ రాజు ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించిందని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన శిబిరంలో 500 మంది దాకా ప్రజలు హాజరై వైద్య సేవలు అందుకున్నారని తెలిపారు. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగులకు ఫుడ్ కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. అనంతరం హాస్పిటల్‌లో వైద్యులకు సన్మానం చేశామన్నారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ రవికుమార్ మహంకాళి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవిబాబు, డేనియల్ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుమన్ పాల్గొన్నారు.

మే నెలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కర్నూలు (టౌన్): జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మే నెల 1 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హతలను, శిక్షణ నిర్వహించే క్రీడాంశం, వేదిక, క్రీడా సామగ్రి ఇతర వివరాలను ఈనెల 20 తేదీలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నిదుర కరువాయె!

- వేధిస్తున్న నిద్రలేని సమస్య
- జిల్లాలో 30 శాతానికిపైగా బాధితులు
- నేడు వరల్డ్ స్లీప్ డే

ప్రతి ఒక్కరికీ ఆహారం ఎంత ముఖ్యమో నిద్ర కూడా అంతే ప్రధానం. నిద్రసరిగ్గా లేకపోతే మరుసటి రోజు ఆ మనిషి ముఖం కళావిహీనంగా మారిపోతుంది. అది ఆ రోజు చేసే పనిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మనిషికి హుషారు ఉండదు. ఒళ్లంతా నరాల బలహీనంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించని లక్షణాలు వారిలో కనిపిస్తాయి. ఈనెల 15న వరల్డ్ స్లీప్ డే సందర్భంగా నిద్ర లేమికి కారణాలు, పరిష్కార మార్గాలపై 'సాక్షి' కథనం.

– కర్నూలు(హాస్పిటల్)

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిద్రలేమి సమస్యతో 30 శాతం మంది బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. కోవిడ్ అనంతరం ఈ సమస్య మరింత అధికంగా ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు. కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరులలో నిద్రలేమి సమస్యతో మానసిక వైద్యనిపుణులు, జనరల్ ఫిజీషియన్ల వద్దకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో 70 శాతం ఆందోళన, మానసిక ఒత్తిడితో వచ్చే వారు ఉన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ వ్యవహారాల విషయాల్లో అనవసర భయాందోళనకు గురవుతున్న వారు కూడా ఎక్కువగానే ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

నగర వీధుల్లో నిశాచరుల్లా..

నిద్రలేమి సమస్యతో కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి పట్టణాల్లో రాత్రి వేళల్లో రోడ్లపై తిరిగే వారి సంఖ్య అధికమైంది. వీరు ఎక్కువగా టీ హోటళ్లు, తోపుడు బండ్ల వద్ద కాలం పడుతున్నారు. కర్నూలు నగరంలోని పలువురు టీ తాగేందుకే అలంపూర్ టోల్‌ప్లాజా వరకు వెళ్లి వస్తున్నారు. చివరికి తెల్లవారుజామున 3 లేదా 4 గంటలకు ఇళ్లకు చేరుకుని నిద్రపోతున్నారు. ఇలాంటి వారిలో 20 నుంచి 45 ఏళ్లలోపు వారు అధికంగా ఉన్నారు.

మానిటర్ వైపు తదేకంగా చూడటంతో..

కోవిడ్ అనంతర పరిస్థితుల కారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అప్పట్లో వర్క్ ఫ్రం హోమ్ డ్యూటీలు ఉండేవి. కొందరికి ఇప్పటికీ ఈ విధానం అమలవుతోంది. ఇంటి వద్ద ఉన్నారన్న విషయమే గానీ రాత్రిళ్లు కూడా వారు పనిచేయాల్సి వస్తోంది. ఒళ్లో ల్యాప్‌టాప్ పెట్టుకుని గంటల తరబడి ఆన్‌లైన్‌లో గడపాల్సి వస్తోంది. ఇలా ఎక్కువసేపు మానిటర్ వైపు చూడటంతో నిద్రలేమి సమస్య, మానసిక ఒత్తిడి వస్తోందని వైద్యులు చెబుతున్నారు. మరికొందరు యువత స్మార్ట్‌ఫోన్‌కు అతుక్కుపోయి కాలక్షేపం చేస్తూ రాత్రి 2 గంటలకు నిద్రపోయేవారు అధికమయ్యారు. దీంతో పాటు పలువురికి ఉద్యోగ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, చదువులో విపరీతమైన పోటీ వంటి వాటివల్ల నిద్రలేమి సమస్యలు వస్తున్నాయి.



సరైన నిద్రకు..

- ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవాలి. ఒకే సమయానికి నిద్రలేవాలి.
- ప్రతి ఒక్కరూ వారి వయస్సును బట్టి రాత్రి 6 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలి.
- రాత్రిపూట తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి.
- కాఫీ, టీ ఎక్కువగా తాగడం, పొగాకు నమలడం, సిగరెట్, బీడీలు తాగడం, ఆల్కహాలు తీసుకోవడం వంటి అలవాట్లు మానుకోవాలి.
- మొబైల్ ఫోన్, కంప్యూటర్, టీవీల నుంచి వచ్చే బ్లూలైట్‌కు కనీసం నిద్ర సమయానికి రెండు గంటల ముందు నుంచి దూరంగా ఉండాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- రాత్రి నిద్రపోయే ముందు తేలికపాటి నడక, ధ్యానం చేయడం, సంగీతం వినడం మంచిది.
- పగటి పూట నిద్రపోయే అలవాటు ఉంటే 45 నిమిషాలు మించకుండా చూసుకోవాలి.
- బెడ్‌రూమ్ వాతావరణం నిశ్శబ్దంగా, వీలైనంత చీకటిగా సరైన ఉష్ణోగ్రతలో, తాజా గాలి వచ్చేలా ఉండాలి.
- మానసిక ఆందోళనను కలిగించే విషయాలు రాత్రిపూట నిద్ర సమయంలో చర్చించడం మంచిది కాదు.

డిస్క్ సమస్యలతోనూ నిద్రలేమి



చాలా మంది డిస్క్ సమస్యలతో బాధపడుతున్నారు. సర్వైకల్ స్పాండిలోసిస్‌తో పాటు లంబార్ డిస్క్ ప్రాబ్లమ్స్ అధికంగా ఉంటున్నాయి. వీటి కారణంగా రాత్రిళ్లు నిద్రాభంగం ఏర్పడుతుంది. మైగ్రేన్ తలనొప్పి, టెన్షన్ తలనొప్పి వల్ల కూడా నిద్ర సరిగ్గా పట్టదు. షుగర్ రోగుల్లో తరచుగా వచ్చే పెరిఫరల్ న్యూరోపతి వల్ల అరికాళ్లలో మంటలు, తిమ్మిర్లు, జోముల వల్ల కూడా నిద్ర సరిగ్గా పట్టదు. ఆయా ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించి తగిన వైద్యపరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకుంటే నిద్ర సమస్య తొలగిపోతుంది. – డాక్టర్ కె.హేమంత్ కుమార్, న్యూరోఫిజీషియన్, కర్నూలు

45 శాతం మందిలో నిద్ర సమస్యలు



ప్రపంచ జనాభాలో 45 శాతం నిద్ర సమస్యతో బాధపడుతున్నారు. స్లీప్ అప్నియా ఉన్న వారికి గురక, నిద్రలో ఊపిరి ఆగి మెలకువ రావడం, పగలు అతి నిద్ర, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి వారు వెంటనే పల్మనాలజిస్టు/ స్లీప్ స్పెషలిస్టును కలిసి చికిత్స చేయించుకోవాలి. పాలీ సోమ్నో గ్రఫి(నిద్రపరీక్ష) ద్వారా సమస్యను గుర్తించవచ్చు. సీపీఏపీ తెరపీ,బరువు తగ్గడం, కొన్నిరకాల శస్త్రచికిత్సల ద్వారా చికిత్స చేయవచ్చు. – డాక్టర్ పొట్టి వెంకటచలమయ్య, పల్మనాలజిస్టు, కర్నూలు

మూత్రపిండాల సమస్యలపై అవగాహన కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న ఆసుపత్రి అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): మూత్రపిండాల సమస్యలపై ప్రజలు అవగాహన కలిగించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. గురువారం అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలోని నెఫ్రాలజీ, యురాలజీ విభాగాల ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రిలో ర్యాలీని ప్రారంభించిన అనంతరం డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ మన శరీరంలో కిడ్నీ ముఖ్యమైన భాగమన్నారు. ఇది ఎలాంటి చెడు పదార్థాలనైనా వడబోసి బయటకు పంపించేందుకు ఉపయోగపడుతుందన్నారు. డయాబెటీస్, స్థూలకాయం, హైపర్‌టెన్షన్ కారణంగా ఇది జబ్బులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మూడు జబ్బులను నియంత్రించుకుంటే కిడ్నీ సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. కిడ్నీ సంబంధిత డైట్‌ను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ఉప్పు వద్దు...పప్పు ముద్దు నినాదంతో వచ్చిన అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం రోజు నుంచి ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో మార్పు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగం వైద్యులు జిక్కి, అనంత్, వెంకటపక్కిరెడ్డి, శ్రీధరశర్మ, యురాలజీ హెచ్ఓడీ డాక్టర్ సీతారామయ్య, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ వెంకటతులశమ్మ పాల్గొన్నారు.



కర్నూలు సమగ్ర నీటి పథకం, మురుగునీటి శుద్ధి కేంద్రాలకు గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, శ్రీదేవి, సుధాకర్, కలెక్టర్ డాక్టర్ సృజన, జేసీ మౌర్య, మేయర్ బీవై రామయ్య, నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, ఎస్వీ విజయమనోహరి, తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

మోదీకి ఓటుతో గుణపాఠం చెబుదాం

కర్నూలు(సెంట్రల్): వచ్చే ఎన్నికల్లో కార్మిక, రైతు వ్యతిరేకి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఓటుతో గుణపాఠం చెబుదామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి అన్నారు. గురువారం కిషాన్ మోర్చా నాయకత్వంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న మహా పంచాయత్‌కు మద్దతుగా రైతు సంఘాల ఆధ్వర్యంలో జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధరకు చట్ట రూపం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు, నగర కార్యదర్శులు చంద్రశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పరుగులు

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



క్రైస్తవ శ్మశాన వాటికలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): ఐదేళ్ల కాలంలో నగరంలో అభివృద్ధిని పరుగులు పెట్టించినట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ తెలిపారు. గురువారం రూ.1.49 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొహరాపురంలో రూ.50 లక్షలతో క్రైస్తవ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నామన్నారు. కిడ్స్ వరల్డ్ వద్ద అబ్దుల్ సలాం ఖాన్ క్లాక్ టవర్ నిర్మాణానికి రూ.50 లక్షలు వెచ్చించనున్నామన్నారు. 51వ వార్డు పరిధిలో రూ.49.90 లక్షలతో తెలుగు తల్లి సర్కిల్ అభివృద్ధి, సుందరీకరణ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఒకప్పటి రాజధాని కర్నూలును గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. 2019లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.700 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆనంద్ థియేటర్ వద్ద కాజ్‌వే బ్రిడ్జి, జొహరాపురం వద్ద రోడ్ కం బ్రిడ్జి, స్టేడియాలు, పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు, గడప గడపకు ప్రభుత్వం పేరుతో ప్రతి కాలనీలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద సెల్ఫీ పాయింట్, పార్కు, లేజర్ షో వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు పల్లవి, విజయలక్ష్మి, షేక్ యూనుస్ బాషా, నగరూరు శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు షాకీర్, హుసేన్, సీఎస్ఐ చర్చి పాస్టర్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు నవీన్, గడ్డం రామకృష్ణ, సుచరిత పాల్గొన్నారు.

డైట్ కాలేజ్ ప్రిన్సిపాల్‌కు పదోన్నతి



బాధ్యతలు స్వీకరిస్తున్న పి.వసుంధరా దేవి

కర్నూలు (సిటీ): ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ) పూర్తి అదనపు బాధ్యతలు ని ర్వహిస్తున్న సీనియర్ అధ్యాపకురాలు పి.వసుంధరా దేవి పాఠశాల విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన ఆమెను డైట్ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

నదులను పరిరక్షించుకుందాం

- జిల్లా మేధావుల వేదిక నాయకులు



నివేదికను విడుదల చేస్తున్న మేధావుల వేదిక ప్రతినిధులు

కర్నూలు(సిటీ): హంద్రీ, తుంగభద్ర నదుల మధ్యలో విరజిల్లుతున్న నాగరికత కర్నూలు నగరానిదని, ప్రతి ఒక్కరూ ఈ నదులను పరిరక్షించుకుని మానవ జీవితాలను కాపాడుకుందామని కర్నూలు జిల్లా మేధావుల వేదిక పిలుపునిచ్చింది. గురువారం నగరంలోని తెలుగు తోటలో అంతర్జాతీయ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నదుల సంరక్షణపై చర్చాగోష్ఠి నిర్వహించారు. వేదిక వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రెహమాన్, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్ కల్కూరా, తెలుగుభాష వికాస ఉద్యమ అధ్యక్షులు జేఎస్ఆర్‌కే శర్మ ప్రసంగించారు. తుంగభద్ర, హంద్రీ నదులు మానవుని స్వార్థానికి బలై మురుగునీటితో, కలుషిత రసాయనాలతో విష వలయంగా మారాయన్నారు. నిర్లక్ష్యం చేస్తే మానవ సమాజానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నదుల సంరక్షణపై నగరవాసుల్లో చైతన్యం తెచ్చేందుకు తమ వేదిక కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం కర్నూలు నగరం ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలికి అందజేశామన్నారు. సమావేశంలో చరిత్రకారులు బి.ఇమ్మానుయేల్, విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఎంవీఆర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిద్దాం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు (సిటీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసి కోడుమూరు నియోజకవర్గంలో ముచ్చటగా మూడోసారి భారీ మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కర్నూలు పార్లమెంటు అధ్యక్షులు, మేయర్ బీవై రామయ్య, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని కర్నూలు అర్బన్‌లో ఉన్న 38, 39, 40 వార్డులలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయం తక్కువగా ఉందని, ప్రతి కార్యకర్త ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేక విఫలమయ్యారని, ఎన్నికలకు ముందుగానే వారికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలు పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలంటే కచ్చితంగా వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని, కావున ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేసి రాబోయే ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గ అభ్యర్థి, కర్నూలు పార్లమెంటు అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రశాంత్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, పార్టీ కార్యకర్తలు కిరణ్, మధుశేఖర్, రజియా, శేషన్న, రాము, మధుసూదన్, యేసుదాసు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జేసీఎస్ అదనపు కో-ఆర్డినేటర్‌గా వినీత్‌కుమార్‌రెడ్డి

కర్నూలు (టౌన్):జిల్లా జేసీఎస్ అదనపు కో- ఆర్డినేటర్‌గా వినీత్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయనను నియమించినట్లు గురువారం సాయంత్రం పార్టీ కేంద్రకార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

మార్కెట్‌లోకి 'హీరో ఎక్స్‌ట్రీమ్ 125'



హీరో ఎక్స్‌ట్రీమ్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కర్నూలు (టౌన్): స్థానిక బంగారుపేటలో ఉన్న అక్షయ హీరో షోరూమ్‌లో గురువారం హీరో ఎక్స్‌ట్రీమ్ 125 ద్విచక్ర వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. అక్షయ హీరో మేనేజింగ్ డైరెక్టర్ మణిపాల్ రెడ్డి, టెరిటరీ మేనేజర్ సాయిచరణ్, జనరల్ మేనేజర్ రాఘవేంద్ర కుమార్ చేతుల మీదుగా వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారుల కోసం హీరో ఎక్స్‌ట్రీమ్ ద్విచక్రవాహనంలో ఆధునిక టెక్నాలజీని వాడినట్లు చెప్పారు. సుఖవంతమైన డ్రైవింగ్, పూర్తి రక్షణ, అధిక మైలేజీ వస్తుందన్నారు. ఈనెల 31 వరకు అన్ని హీరో వాహనాలపై రూ.5 వేల వరకు ఆఫర్ ఉంటుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రజా రవాణా శాఖలో పనిచేస్తూ 2020 జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో మృతిచెందిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు గురువారం కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చారు. కారుణ్య నియామకం కింద ఎంపికైన 19 మందికి జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ కె.సుధాకర్ ఉన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

- పీఆర్అండ్ఆర్‌డీ కమిషనర్ కన్నబాబు



వీసీకి హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు

కర్నూలు(అర్బన్): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పీఆర్అండ్ ఆర్‌డీ కమిషనర్ కన్నబాబు ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యం, ఈఈ మద్దన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ నాగేశ్వర రావు, ఏపీ టూరిజం అధికారిణి విజయ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నీటి సమస్య తలెత్తకుండా సీపీడబ్ల్యూఎస్ పథకాలను అధికారులు పరిశీలించాలన్నారు. గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకునే చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలను త్వరితగతిన రూపొందించి ఈ- గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పన్నులు, పన్నేతరముల వసూళ్లు 50 శాతానికి మించి లేదని, ఇక 15 రోజులే గడువు ఉన్నందున వేగం పెంచాలన్నారు.అలాగే అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జెడ్పీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డీపీఓ నాగరాజునాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 484 గ్రామ పంచాయతీ లు ఉండగా, 473 గ్రామ పంచాయతీలకు సంబంధించిన జీపీడీపీ ప్లాన్‌ను పంపించామన్నారు. అలాగే పన్నుల వసూళ్లు 44 శాతం ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో సతీష్, హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి.బెళగల్ మండలానికి చెందిన దుబ్బన్న కుటుంబానికి రూ.2 లక్షలు, బెస్త వెంకటేశ్వరి కుటుంబానికి రూ.2 లక్షలు, మాల జమ్మన్న కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున మంజూరు కావడంతో చెక్కులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, సర్పంచు పాండురంగడు, కో-ఆప్షన్ మెంబర్ హరుణ్, జేసీఎస్ కన్వీనర్ తులసిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు (టౌన్): స్థానిక మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని బుధవారపేటకు చెందిన ఉమామహేశ్వరరెడ్డి (28) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వృత్తిరీత్యా కారు డ్రైవర్. ఇటీవల కారు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే ఉంటున్నాడు. మద్యానికి బానిసై బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తల్లి శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.